# పూల తోట.. నష్టాల బాట

- తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో పడిపోయిన ధరలు
- నష్టాలపాలవుతున్న పూల రైతులు

**అమరాపురం:** పూల తోట.. నష్టాల బాట పట్టింది. మండలంలో పూల తోటలు సాగు చేసిన రైతులు నష్టాల పాలవుతున్నారు. ప్రస్తుతం ఆషాఢమాసం కావడంతో పూలకు ధరలు లేక నష్టాలను చవి చూస్తున్నారు. మండలంలోని పుల్లీకుంట, ఉదుగూరు, వి.అగ్రహారం, వలస, దేవగానపల్లి, గౌడనకుంట, అలదపల్లి, కాచికుంట, నిద్రగట్ట తదితర గ్రామాల్లో 50 ఎకరాలకు పైగా పూల తోటలను సాగు చేశారు. అయితే ప్రస్తుతం వర్షాలు కురవక పోవడంతో పాటు దిగుబడి తక్కువగా వస్తోంది. ధరలు కూడ ఆశించిన స్థాయిలో లేవు. దీంతో పూలను కోయడానికి పెట్టిన కూలి గిట్టుబాటు కావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల మీద కనికరం చూపించడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేల చొప్పున జమ చేయలేదు. గత ఏడాది రైతులకు పెట్టుబడి సాయం అందజేయకుండా కూటమి ప్రభుత్వం రైతులను నిలువుగా మోసం చేసింది. ఈ ఏడాది సైతం పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో రైతులు అప్పులు చేసి మరీ పూల తోటల సాగుకు మొగ్గు చూపారు. టా నష్టాలు వస్తున్నా వివిధ రకాల పంటలను సాగు చేసినా ప్రయోజనం లేక పోవడంతో తక్కువ నీటితో అధికంగా పూల తోటలు సాగు చేసి పెట్టుబడి వస్తుందనుకుంటే.. ఇది కూడ కష్టాంగానే ఉన్నట్లు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో మల్లెపూలు మారుకు రూ.50, కాకడ రూ.50, చేమంతి, రూ.100, బంతి పూలు రూ.50 పలుకుతున్నాయి. ఈ ధరలు కనీసం కూలి ఖర్చులకు సరి పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పూల రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.


అమరాపురంలో పూల కొనుగోలుదారులు లేక బోసిపోయిన మార్కెట్

### మార్కెట్లో ధరలు లేవు


నాకున్న భూమిలో అర ఎకరాలో మల్లెపూల తోట సాగు చేశా. అయితే ప్రస్తుతం మార్కెట్లో ధరలు లేవు. పూలు కోసి వాటిని హారంగా పేర్చుకుని ఉదయాన్నే మార్కెట్‌కు తీసుకొస్తా. పూలను కొనుగోలు చేసే వారు కరువయ్యారు. ధర కూడా తక్కువగా ఉండటంతో గిట్టుబాటు కావడం లేదు. కూలి ఖర్చులు కూడా రావడం లేదు. ఆర్థికంగా చితికిపోతున్నాం.

– తిప్పేస్వామి, రైతు, పుల్లీకుంట

### పూల రైతులను ఆదుకోండి


మండలంలో పూల తోటలు సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. పూల రైతులు నష్టాల్లో ఉన్నారు. మార్కెట్లో ఆశించిన ధరలు లేవు. కనీసం పూల తోటలను సాగు చేసిన రైతులకు సబ్సిడీ రూపంలో రుణాలు మంజూరు చేయాలి. తద్వారా పూల రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది.

– నాగభూషణ, రైతు, ఉదుగూరు

### 'ఉపాధి హామీ'తో అనుసంధానం చేయాలి


ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. అయినా కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. కూలీలు ఎక్కువగా ఉపాధి హామీ పనులకు వెళ్తుండటంతో వ్యవసాయ పనులకు కొరత ఏర్పడుతోంది. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తే రైతులకు కూలి చెల్లించే ఖర్చు తగ్గుతుంది. ధరలు లేకున్నా ఇబ్బంది ఉండదు. కూటమి ప్రభుత్వ ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– గోవిందరాయ, వలస

## క్లుప్తంగా

### ఆర్డీటీని కాపాడుకుందాం


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**లేపాక్షి:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో విశిష్ట సేవలు అందించిన ఆర్డీటీని కాపాడుకుందామని పలువురు పిలుపునిచ్చారు. ఆర్డీటీ సేవలు కొనసాగేలా ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్డీటీ సేవలు ఆగితే పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు భారీగా నష్టపోతారని తెలిపారు. ఆర్డీటీ సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పోస్టు కార్డులు పంపించారు. కార్యక్రమంలో నరసింహప్ప, రామాంజినప్ప, శ్రీనివాసులు, రత్నమ్మ, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

### 21న పావగడలో సీఎం పర్యటన


హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**పావగడ:** ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈనెల 21న పావగడలో పర్యటించనున్నారు. భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్న స్థానిక మహాత్మా గాంధీ స్టేడియం మైదానం, సభా వేదికను తుమకూరు జిల్లా కలెక్టర్ శుభ కళ్యాణ్ బుధవారం పరిశీలించారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప చళ్లికెరె రోడ్డులో ఏర్పాటు చేసే హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీఈఓ ప్రభు, తహసీల్దార్ వరదరాజు, కాంగ్రెస్ నాయకులు శంకరరెడ్డి, రాజేశ్, రవి, రమేశ్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో జలధి


పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేయిస్తున్న దృశ్యం

**మడకశిరరూరల్:** మొహర్రం వేడుకల్లో భాగంగా గౌడనహళ్లి గ్రామంలో కొలువు దీరిన పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం తెల్లవారుజామున పీర్లతో అగ్ని గుండ ప్రవేశం చేయించారు. భక్తులు పీర్లకు బెల్లం, చెక్కర చదివింపులు చేయించారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో పీర్లను జలధికి తరలించారు.

### రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

**హిందూపురం:** ఏపీ 5వ గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్ షిప్–2025 పోటీల్లో హిందూపురం విద్యార్థులు పతకాలు సాధించినట్లు రెజ్లింగ్ కోచ్ ఆర్‌కె.రమేష్ తెలిపారు. తిరుపతిలో ఈనెల 12, 13 తేదీల్లో జరిగిన పోటీల్లో అండర్–11 విభాగంలో తిశాల్ దత్త బంగారు పతకం, సాయిగగన కాంస్యం, అండర్–13 విభాగంలో హితేష్ దత్త బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను కోచ్‌తో పాటు చరణ్ రాజు, ఉసామాఖాన్ అభినందించారు.

### నేటి నుంచి మౌలాలి ఉరుసు


అలంకరణలో మౌలాలి దేవుడు

**అమరాపురం:** స్థానిక పాత మసీదు వద్ద గురువారం నుంచి మౌలాలి ఉరుసు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 30 సంవత్సరాల అనంతరం జరగనున్న ఉరుసుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 17 నుంచి 21 వరకు ఐదు రోజుల పాటు ఉరుసు నిర్వహిస్తారు. 17న సాయంత్రం మౌలాలిని కొలువు దీర్చడం, గద్దిగ పూజ, 18న మౌలాలి విగ్రహ ఊరేగింపు, బండి మల్లన్న ఇంటి దగ్గర కూర్చొబెట్టి పూజలు చేస్తారు. అనంతరం శిర రోడ్డులో ఉన్న కొలిమి కుటుంబాల వద్ద పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. 19న ఇందిరమ్మ కాలనీ నుంచి తిరిగింపుగా మౌలాలి విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో కొలువుదీరుస్తారు. 20న పాత మసీదు వద్ద అగ్నిగుండ కార్యక్రమం, చోళమాంబదేవి ఆవరణలో పూజలు, గంధం పూజ, రాత్రికి ఖవ్వాలీ, 21న గంధం పూజతో పాటు ఊరేగింపు దేవాలయంలో దేవుని చేర్చుట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమరాపురం, పుల్లీకుంట, వీరాపురం, బంగారు పాళ్యం, మద్దనకుంట గ్రామస్తులు ఉరుసులో పాల్గొంటారు.

## కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం


రొద్దం మండలం బొక్సంపల్లిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు


పరిగి: రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

**పరిగి:** రాష్ట్రంలో కూటమి సర్కార్ ప్రజలకు చేసిందేమి లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని ఎర్రగుంట పంచాయతీ నేతులపల్లిలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను వంచించి, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. మండలంలో కూటమి నాయకుల మట్టి, ఇసుక దోపిడీ, అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం చేసిన మోసపూరిత వాగ్దానాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, వివిధ గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రొద్దం:** చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలు గమనించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. బుధవారం మండల పరిధిలోని తురకలాపట్నం, బొక్సంపల్లి, సానిపల్లి గ్రామ పంచాయతల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను ఇంటింటా వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, ఎంపీపీ నాగమ్మ తిమ్మయ్య, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, సర్పంచులు నాయకులు అక్కులప్ప, నరేంద్రరెడ్డి, సి.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఎన్ నారాయణ రెడ్డి, జయరామిరెడ్డి, చికలక రవి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం


మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

**అగళి:** కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఆర్భాటాలు తప్ప ప్రజలకు చేసింది శూన్యం. ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లి పంచాయతీ గాయత్రీ కాలనీ గ్రామంలో ముత్రాయ స్వామి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా మజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. చంద్రబాబును నమ్మి మోసపోయామంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని వెల్లడించారు. వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక నాయకులపై కేసులు పెడుతున్నారని తెలిపారు. సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, సర్పంచ్ ముద్దరాజు, రామకృష్ణప్ప, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ జయకుమార్, నాయకులు రంగప్ప తిమ్మరాయప్ప, హనుమంతరాయ, నరసింహ రాజు, ఈరన్న, వైస్ ప్రెసిడెంట్లు బోజేగౌడ్, శివరాజు, జనరల్ సెక్రటరీలు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతో సులభంగా కేసుల పరిష్కారం


హిందూపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**హిందూపురం:** మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం సులభతరం అవుతుంది. దీనిపై కక్షిదారులు అవగాహన పెంచుకోవాలని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ అన్నారు. బుధవారం స్థానిక ఏడీజే జిల్లా కోర్టు ఆవరణ నుంచి జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం వరకు మధ్యవర్తిత్వంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కోర్టు సిబ్బంది మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పిస్తూ స్థానికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కేసులు పరిష్కరించడంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భరణం కేసులు, చెక్ బౌన్స్ కేసులను మధ్యవర్తుల ద్వారా పరిష్కరించుకునేందుకు న్యాయవాదులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య, మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులు రాజశేఖర్, సిద్దు, సంతోషి కుమారి, కళావతి, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి, సత్యనారాయణ, వీరసేన, రవికుమార్, నవేరా, రవిచంద్ర, అజయ్, ఎస్ఐ కళావతి, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

**మడకశిర:** మధ్యవర్తిత్వం కేసులు పరిష్కరించుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్ కుమార్ కోరారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు ఎలా పరిష్కరించుకోవాలనే అంశంపై ఈనెల 10 నుంచి ప్రారంభమైన అవగాహన కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. కార్యక్రమంలో న్యాయవాదులు ఉమేష్‌చంద్ర, గోపి తదితరులు పాల్గొన్నారు.

**పెనుకొండ:** మధ్యవర్తిత్వం ద్వారా పూర్తి స్థాయిలో కేసును పరిష్కరించుకుంటే అలాంటి కేసులకు పునఃసమీక్ష, అప్పీలుకు ఏమాత్రం అవకాశం ఉండదని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వాసుదేవన్ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో బుధవారం మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జొజ్జప్ప, రాకేష్ పాల్గొన్నారు.

## పెండింగ్ జీతాలు చెల్లించాలి


మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

**హిందూపురం టౌన్:** పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని గొల్లపల్లి వాటర్ వర్కర్స్ డిమాండ్ చేశారు. బుధవారం కమిషనర్ మల్లికార్జునకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, జిల్లా కోశాధికారి బాబు మాట్లాడుతూ.. గొల్లపల్లి వాటర్ వర్కర్స్ జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాలుగు నెలలుగా తమ సమస్యలను మున్సిపల్ కమిషనర్, అధికారులకు వినతి పత్రాలు, నిరసనలు ద్వారా తెలియజేశామన్నారు. అయినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ఆగస్టు 1 నుంచి హిందూపురం పట్టణానికి నీరు బంద్ చేసి సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్మిక చట్టం ప్రకారం 14 రోజులు ముందే సమ్మె నోటీసు అందించడం జరిగిందన్నారు. అంతలోపు సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మె కొనసాగుతుందని తెలిపారు. అప్పటి వరకు పంప్ హౌస్‌ల వద్ద దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి మారుతి రెడ్డి, గొల్లపల్లి వాటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రమేష్, కార్యదర్శి రాజు, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఉమేష్, నాగరాజు, సహాయ కార్యదర్శిలు ఆదినారాయణ, తబ్బుల్, కమిటీ సభ్యులు మంజునాథ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

**రొళ్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కాకి ఉన్నత, కాకి ఆదర్శ ప్రాథమిక పాఠశాల, జీబీ హళ్లి, ఎల్‌కే పల్లి తదితర ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎండీఎం నిర్వహకులు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు.

### క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత

**పెనుకొండ:** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రగతి గ్లోబల్‌జెన్ పాఠశాలల కరస్పాండంట్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని పాఠశాలల్లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ కోర్సులే కాకుండా ఇతర కోర్సులపై దృష్టి సారించాలన్నారు. కెరీర్ గైడెన్స్‌పై అధ్యాపకుడు విశ్వనాథ్ అవగాహన కల్పించారు.

### సస్యరక్షణ చర్యలతో దిగుబడి

**గుడిబండ:** మొక్కజొన్న సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ వీరనరేష్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హిరేతుర్పి, కుంభరనాగేపల్లి తదితర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా గ్రామాల్లో రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించారు.

### ఈ-కేవైసీ పూర్తి చేయండి

**రొళ్ల:** అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేసేందుకు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ షేక్షావలి, వ్యవసాయశాఖ అధికారి వెంకటబ్రహ్మం పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2025 ఖరీఫ్ సాగుకు సంబంధించిన పంట నమోదును తప్పనిసరిగా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, ఏఈఓలు చంద్రకళ, హేమలత, వీఆర్వోలు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీకి ఎంపిక

**పెనుకొండ రూరల్:** మండలంలోని గుట్టూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యయుడు నాగార్జునుడు తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఉష శ్రీ (577), మౌన శ్రీ (569), జాహ్నవి (569) ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**చిలమత్తూరు:** మండల పరిధిలోని 544ఈ జాతీయ రహదారిపై హ్యూమ్ పైప్ ఫ్యాక్టరీ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చిలమత్తూరుకు చెందిన నిఖిల్.. మరవకొత్తపల్లి బీసీ కాలనీకి చెందిన రామాంజనేయులు ద్విచక్ర వాహనాల్లో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నిఖిల్ తలకు గాయం కాగా.. రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు 108 ద్వారా వేర్వేరుగా బెంగళూరుకు తరలించారు.

## ఘనంగా ఉషశ్రీచరణ్ జన్మదిన వేడుకలు


పెనుకొండలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

**పరిగి/రొద్దం/మడకశిరరూరల్/సోమందేపల్లి/పెనుకొండ రూరల్:** వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. పరిగి, రొద్దం, మడకశిర, సోమందేపల్లి, పెనుకొండలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. మడకశిర మండలం ఆమిదాలగొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పరిగి మండల కన్వీనర్ బీకే నరసింహమూర్తి, రొద్దం మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, ఎంపీపీ నాగమ్మ తిమ్మయ్య, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, సర్పంచులు నాయకులు అక్కులప్ప, నరేంద్రరెడ్డి, సి.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ఎస్.నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, చికలక రవి, విశ్వనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, నియోజకవర్గ కమిటీ సభ్యులు శేషాద్రి, మల్లికార్జున, నరసింహ,బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ యాదవ్, మండల కమిటీ సభ్యులు రంగనాథ్, నాగభూషణరెడ్డి, తిప్పేస్వామి, శ్రీరామరెడ్డి, వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, సుధాకర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సూర్య ప్రకాశ్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, కౌన్సిలర్లు శేషాద్రి, సద్దాం, నాయకులు వైశాలి జయశంకర్ రెడ్డి, గణప్ప, శ్రీరాములు, కిష్టప్ప, కొండల రాయుడు, రాము, వెంకటేశులు, మల్లి రెడ్డి, పిట్టా బాబు, ప్రసాద్ రెడ్డి, లోకనాథ్ రెడ్డి, నారాయణ స్వామి, చెన్నకేశవులు, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణదేవరాయల జయంతి నిర్వహించాలి



మాట్లాడుతున్న వక్తలు

**అగళి:** విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారింగా నిర్వహించాలని ఆర్‌పీఎఫ్ జాతీయ అధ్యక్షుడు తిరుమల శెట్టి రెడ్డి శేఖర్ రాయల్, బలిజ సంఘ నాయకులు కోరారు. బుధవారం మండల పరిధిలోని నరసబుంది గ్రామంలోని రంగనాథ స్వామి దేవాలయంలో మడకశిర నియోజవర్గ బలిజ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమలలోని ఏడుకొండల అభివృద్ధికి శ్రీకృష్ణదేవరాయలు కృషి చేశారన్నారు. రాయలసీమను రతనాలసీమగా చేసిన ఘనత శ్రీకృష్ణదేవరాయలకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాయలసీమ కన్వీనర్ ఎర్రం శెట్టి రమేష్, కదిరి, చిత్తూరు, మడకశిర నియోజకవర్గం బలిజ నాయకులు పాల్గొన్నారు.

### ఉరుసుకు బ్రేక్..

**సోమందేపల్లి:** మండలంలోని తుంగోడు సమీపంలో జరిగే షా ఫకృద్దీన్ బాబా ఉరుసుకు పోలీసులు బ్రేక్ వేశారు. బుధవారం గంధం వేడుకలు నిర్వహించేందుకు దర్గా పీఠాధిపతి జిక్రియా తదితరులు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే తమ భూమిలో ఉన్న దర్గాకు జిక్రియా కుటుంబీకులకు ఎటువంటి సంబంధం లేదని.. ఉత్సవాలు నిర్వహిస్తే ఘర్షణ జరిగే అవకాశం ఉందని భూ యజమాని సుధాకర్ రెడ్డి రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన సీఐ రాఘవన్ ఉరుసు నిర్వాహకులతో మాట్లాడారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని సూచించారు. ఈనెల 9న కలెక్టర్ టీఎస్ చేతన్ ఉరుసు నిర్వహణకు ఉత్తర్వులు ఇవ్వడంతో గంధం వేడుకల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని దర్గా నిర్వాహకులు రెవెన్యూ, పోలీసు అధికారులను ఆశ్రయించారు.

### వర్షాలు కురిపించు.. భూతరాయ స్వామి


తమ్మదేపల్లిలో భూతరాయ స్వామికి పూజలు చేసిన దృశ్యం

**అమరాపురం:** వర్షాలు కురిపించాలని కోరుతూ బుధవారం మండల పరిధిలోని తమ్మదేపల్లి పొలిమేరలో వెలసిన భూతరాయ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాగు చేసిన పంటలు ఎండిపోకుండా సమృద్ధిగా వర్షాలు కురవాలని వేడుకున్నారు. తొలుత స్వామికి వివిధ రకాల అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అక్కడే వంట వార్పు చేసి స్వామికి నైవేద్యం పెట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.


అన్నదానం చేస్తున్న గ్రామస్తులు